## ప్రతినిత్యం అప్రమత్తంగా ఉండాలి

**• ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్**



మంగనూరు చెక్‌పోస్ట్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

బిజినేపల్లి, నవంబర్ 4: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రతినిత్యం అప్రమత్తంగా ఉండి తనిఖీలు నిర్వహించాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. శనివారం మండలంలోని మంగనూర్ చెక్ పోస్ట్, ఎస్ఎస్‌టీ చెక్ పోస్టు, బిజినపల్లి పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో 2023 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నాగర్‌కర్నూల్ జిల్లాలో బిజినపల్లి మండలం మంగనూర్ వద్ద ఉన్న చెక్‌పోస్టు, స్టాటస్టిక్ సర్వేలైన్ టీం చెక్ పోస్టు, బిజినపల్లి పోలీస్‌స్టేషన్‌నీ నాగర్‌కర్నూల్ డీఎస్పీతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారన్నారు. చెక్‌పోస్టు వద్ద వెళ్తున్న వాహనాలను పరిశీలించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన రిజిస్టర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్సై రాములు సిబ్బంది ఉన్నారు.

## నవాబ్‌పేట ఎస్సై పురుషోత్తం రిమాండ్

**• చంచల్‌గూడ జైలుకు తరలించిన అధికారులు**



ఎస్సై పురుషోత్తం

నవాబ్‌పేట, నవంబర్4: భూ తగాదా కే సులో అంచం డిమాండ్ చేసిన నవాబ్‌పేట ఎస్సై పురుషోత్తంను ఏసీబీ అధికారులు శనివారం రిమాం డ్ చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఏసీబీ డీఎస్పీ మాజీద్ అలీఖాన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మల్కాపూర్ కు చెందిన ఓ భూతగాదాలో నమోదైన కేసులో నుంచి ఐదుగురి పేర్లు తొలగించేందుకు అదే గ్రామానికి చెందిన గజ్జి శేఖర్ నుంచి రూ.5లక్షల డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఇదే విషయమై శుక్రవారం ఎస్సై పురుషోత్తంను అదుపులోకి తీసుకొని విచారించినట్లు తెలిపారు. ఆడియో, వీడియో రికార్డింగ్ అధారంగా ఎస్సైపై కేసు నమోదు చేసి, శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపర్చగా జడ్జి.. ఎస్సై పురుషోత్తంకు 14 రోజుల రిమాండ్ విధించగా చంచల్‌గూడ జైలుకు తరలించినట్లు తెలిపారు.

## ఆలయాల్లో చోరీలకు పాల్పడిన దొంగల అరెస్ట్

**• 45తులాల వెండి కిరీటం, రెండు కండ్లు, 2గ్రాముల బంగారం స్వాధీనం**

ఎర్రవల్లి చౌరస్తా, నవంబర్ 4: గద్వాల జిల్లాలో గతకొన్నిరోజులుగా గ్రామ శివార్లో ఎక్కువ జన సంచారం లేని ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నింధితులను జిల్లా పోలీసులు వ్యూహాత్మకంగా నిఘా వేసీ పట్టుకున్నారు. విస్వసనీయ సమాచారం మేరకు.. శనివారం ఉదయం 7గంటల సమయంలో ఎర్రవల్లి చౌరస్తా వద్ద ఇటిక్యాల పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా బైక్‌పై అనుమానాస్పదంగా ఇద్దరు వ్యక్తులు కనిపించారు. వారిని అదుపులోకి తీసుకొని పూర్తిస్థాయిలో విచారించగా.. దొంగలుగా తేలడంంతో ఇటిక్యాల పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా మల్దకల్ గ్రామానికి చెందిన 24ఏండ్ల మొండి శ్రీను, అనంతపురం జిల్లా కొండమాలపల్లి గ్రామానికి చెందిన పొంతగిరి నాగర్జున కలిసి ధన్వాడ మారెమ్మ ఆలయంలో రూ.10వేలు, కొండపల్లి, అనంతపురం, గట్టు అంబాభవానీ ఆలయాలు, వనపర్తి జిల్లా మదనా పురం ఆలయాల్లో చోరీలకు పాల్పడ్డారు. దీంతో నింధితులను శనివారం అరెస్ట్ చేశారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభకనబరిచిన పోలీసులను ఎస్పీ రితురాజ్ అభినందించారు.



నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

# ఎన్నికల నిర్వహణకు బృందాలు

- **వ్యయ పరిశీలకులు బేరారాం చౌదరి**
- **ఎస్ఎస్‌టీ, ఫ్లయింగ్ స్క్వాడ్, ఎంసీఎంసీ సభ్యులతో సమీక్ష**
- **పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్**



ఎన్నికల నిర్వహణ బృందాలతో మాట్లాడుతున్న వ్యయ పరిశీలకులు బేరారాం చౌదరి

నాగర్‌కర్నూల్, నవంబర్ 4: ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు నిర్వాహణ బృందాలైన సర్వైకల్ స్టాటస్టికల్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ తమ విధులను సక్రమంగా నిర్వహించాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు బేరారాం చౌదరి ఆదేశించారు. శనివారం ఉదయం ఐడీవోసీలోని ప్రజావాణి హాల్‌లో జిల్లా ఎన్నికల అధికారి ఉదయ్‌కుమార్‌తో కలిసి ఎస్ఎస్‌టీ, ఫ్లయింగ్ స్క్వాడ్, ఎంసీఎంసీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు నిర్వహించే అన్ని సభలు, సమావేశాలను ఫ్లయింగ్ స్క్వాడ్ టీం వెంట ఉండి పరిశీలించాలని, వీడియోలు తీసి ప్రచారానికైన ఖర్చులు పక్కాగా అభ్యర్థి ఖాతాలో జమ చేయించాలని ఆదేశించారు. ఫిర్యాదులు ఇక్కడి నుంచి ఎవరు చేసిన వెంటనే ఫ్లయింగ్ స్క్వాడ్ టీం అక్కడికి చేరుకొని నిజానిజాలు పరిశీలించాలని సూచించారు. డబ్బులు, మద్యం, వస్తురూపేణ ఇస్తూ ఓటర్లను ప్రలోభ పెడుతుంటారు.. వాటిగురించి సమాచారం తెలుసుకోవడం, ఫిర్యాదులు వస్తే వెంటనే స్పందించే విధంగా ఉండాలన్నారు. సర్వైకల్ స్టాటస్టికల్ బృందాలు కేవలం మామూలు వాహనాలనే కాకుండా కంటైనర్లు, బస్సులను పరిశీలించాలని సూచించారు. ఎక్కడైనా అణువంత అనుమానం వచ్చిన కచ్చితంగా వాటిని పరిశీలించాలని ఆదేశించారు. కంటైనర్లలో భారీగా వస్తువులు రవాణా అవుతుంటాయని, అవి ఎక్కడికి వెళ్తున్నాయి.. ఎవరు తెప్పిస్తారు అనేది పక్కాగా సమాచారం తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల ప్రలోభాలకు సంబంధించిన వస్తువులు ఉండే అవకాశాలు ఉంటాయని తెలిపారు. కంటైనర్లలో వస్తువులు జిల్లాకు వస్తే జీఎస్టీ, ఎస్ఎస్‌టీ వారికి సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. 20నుంచి 30మంది కలిసి ఎక్కడైనా ప్రచారం చేస్తున్నట్లు కనిపిస్తే వెంటనే వారిని వీడియో తీసి, ప్రచారానికి సంబంధించి ముందస్తు రిటర్నింగ్ అధికారి అనుమతి ఉందా అని పరిశీలించాలన్నారు. లేనిపక్షంలో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సూచించారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఐదారుగురు ఒక్కదగ్గర గుమ్మిగుడడానికి వీలులేదని ఒకవేళ గుమిగూడి ప్రచారం చేస్తే మాత్రం ఆర్వో అనుమతి ఉండాలని సూచించారు. లేకుంటే నమోదు చేయాలని చెప్పారు. ఎంసీఎంసీకి సంబంధించి ఎలాంటి వీడియో ప్రకటన చేసిన ముందుగా ఎంసీఎంసీ అనుమతి పొందాలని లేనిపక్షంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కింద కేస్ బుక్ చేయాలన్నారు. ఫోన్ ద్వారా వచ్చే మెసేజ్‌లు, ఫోన్ ద్వారా వచ్చే ఆడియో ప్రచారానికి సైతం ముందస్తు అనుమతి పొందాలని తెలిపారు. పెయిడ్ న్యూస్‌పై పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణకు ఎలక్షన్ నోటిఫికేషన్ వెలువడడంతో నియమావళి అమల్లోకి వచ్చిందన్నారు. ఎన్నికల నిర్వహణ సజావుగా నిర్వహించి గుడ్ వర్క్స్‌ను నమోదు చేయాలన్నారు. ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ, అకౌంట్ టీంల సిబ్బంది ఆయా సందర్భంలో మెరుగైన సేవలు అందించాని చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియామాలను ఉల్లంగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికలు సజావుగా కొనసాగేందుకు ఆయా శాఖల అధికారులు ముందుండాలన్నారు. విధినిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనుమతి లేకుండా చట్టవిరుద్ధ కార్యక్రామాలకు పాల్పడేవారిని కట్టడి చేయాలన్నారు. నియోజకవర్గాల్లో పోటీచేసే అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం గమనించాలని చెప్పారు. ఓట్ల కోసం ప్రజలకు నగదు, మద్యం, ఇతర సామగ్రిని పంపిణీ చేస్తే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, పంపిణీ చేసే వస్తు సామగ్రిని సీజ్ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో మీడియా కోఆర్డినేషన్ నోడల్ ఆఫీసర్ సీతారా మ్ నాయక్, ట్రైనింగ్ మేనేజ్‌మెం ట్ నోడల్ అధికారి నర్సింగ్‌రావు, ఎక్స్‌పెండేచర్ మానిటరింగ్ నోడల్ అధికారి శ్రీనివాస్‌బాబు పాల్గొన్నారు.

**అభ్యర్థులు దాఖలు చేసే అఫిడవిట్లను పరిశీలించాలి**

నామినేషన్ దాఖలు చేసే సందర్భంలో ఆర్వోలు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎన్నికల నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని కేంద్ర ఎన్నికల వ్యవ పరిశీలకుడు భేరారామ్ చౌదరి సూచించారు. శనివారం నాగర్‌కర్నూల్ అసెంబ్లీ నియోజకవర్గం 81రిటర్నింగ్ ఆఫీస్‌లో నామినేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అభ్యర్థులు నామినేషన్ పత్రాలను సమర్పించే సందర్భంలో ప్రతిఅంశాన్ని వారికి స్పష్టంగా తెలియజేయాలన్నారు. అభ్యర్థులు అందజేసే అఫిడవిట్ వ్యయ సమాచారాల నమోదు రిజిస్టర్ చేసే అంశాలను ఆయన రిటర్నింగ్ అధికారికి వివరించారు. అఫిడవిట్లో ఆస్తుల వివరాలు తప్పులు సమర్పిస్తే డిస్క్ క్వాలిఫై అవుతారని ముందస్తుగానే అభ్యర్థులకు తెలియపరచాలన్నారు. నియోజకవర్గంలో మూడుసార్లు నిర్వహించే వ్యయ పరిశీలనకు అభ్యర్థులు హాజరుకావాలని, వారికి ముందస్తుగా తెలియపర్చాలన్నారు. డిస్క్ క్వాలిఫై అవుతారని తెలియపర్చాలన్నారు. శనివారం నామినేషన్లు దాఖలు కాలేదని రిటర్నింగ్ అధికారి తెలిపారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ రిటర్నింగ్ అధికారి వెంకట్‌రెడ్డి నాగర్‌కర్నూల్ డీఎస్పీ మోహన్‌కుమార్, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి ఉన్నారు.



పాల్గొన్న అధికారులు

## వాహనాల తనిఖీల్లో నగదు పట్టివేత

కృష్ణ, నవంబర్ 4 :మండలంలోని తెలంగాణ–కర్ణాటక బార్డర్ చేగుంట చెక్‌పోస్ట్ వద్ద ఎస్సై విజయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో శనివా రం తనిఖీలు నిర్వహించారు. సందర్భంగా కర్ణాటకకు చెందిన శరణప్ప, బాల్‌చేడ్ గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి రూ. 1,15,600, వాసునగర్ చెక్‌పోస్టువద్ద రాయిచూర్ నుంచి హైదరాబాద్‌కు కారులో తరలిస్తున్న రూ. 4,31,100ను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపా రు. ఈ డబ్బును నారాయణపేట గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు తెలిపారు. తనిఖీలలో ఎక్సైజ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**మాగనూర్‌లో...**

మాగనూర్, నవంబర్ 4: మండల కేంద్రంలో ఎస్సై మల్లేశ్ పోలీసు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేయగా మక్తల్ మండలం అంకెన్‌పల్లికి చెందిన గొల్ల శ్రీనివాసులు, అనుగొండ గ్రామానికి చెందిన మరో వ్యక్తి ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.లక్ష తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడ్డ నగదుకు ఎలాంటి రసీదు, తగిన పత్రాలు లేనందున సీజ్ చేసి జిల్లా ఎలక్షన్ ట్రెజరీకి పంపించినట్లు ఎస్సై మల్లేశ్ తెలిపారు.ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎవరైనా రూ.50 వేల కంటే ఎక్కువ డబ్బులు తీసుకువెళ్ళాలంటే వాటికి సంబంధించిన రసీదు, తగిన పత్రాలు ఉండాలని లేకుంటే వాటిని స్వాదీనం చేసుకొని సీజ్ చేస్తామని తెలిపారు.

## ఎఫ్‌సీఐకి సీఎంఆర్ రైస్ అందజేయాలి

- **ఈనెల 30నాటికి వందశాతం పూర్తిచేయాలి**
- **మిల్లింగ్ పూర్తి చేయని రైస్‌మిల్లర్లపై కఠిన చర్యలు**
- **అదనపు కలెక్టర్ సీతారామారావు**
- **అధికారులు, రైస్‌మిల్లర్లతో సీఎంఆర్ రైస్ డెలివరీపై సమీక్ష**

నాగర్‌కర్నూల్, నవంబర్ 4: జిల్లాలో 109 రైస్ మిల్లర్లు త్వరితగతిన సీఎంఆర్ వంద శాతం పూర్తిచేసి ఎఫ్‌సీఐకి రైస్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సీతారామారావు సూచించారు. శనివారం కలెక్టరేట్ ఆయన చాంబర్‌లో అధికారులు, జిల్లా రైస్ మిల్లర్ల యజమానులతో సీఎంఆర్ రైస్ డెలివరీపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2022–23 ఖరీఫ్, రబీ పంటలకు సంబంధించిన సీఎంఆర్ పూర్తి చేయాల్సిన రైస్‌మిల్లర్లు నిర్ణీత సమయంలో పూర్తిచేసి నవంబర్ 30నాటికి ఎఫ్‌సీఐకి అందజేయాలన్నారు. 2022–23 ఖరీఫ్, రబీలో దాదాపు 109 మిల్స్ నుంచి 92,892 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా కావాల్సి ఉండగా 27,926 మాత్రమే సరఫరా అయిందని, ఇంకా 64,971 మెట్రిక్ టన్నుల బియ్యం ఎఫ్‌సీఐకి అందాల్సి ఉందన్నారు. సీఎంఆర్ ఇంకా పూర్తి చేయలేయనివారు నిర్ణీత కాలంలో అందజేయాల్సిన సీఎంఆర్ రైస్ నవంబర్ 30వ తేదీనాటికి అందజేయాలని సూచించారు. మిల్లింగ్ పూర్తి చేయని రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బియ్యం సరఫరా చేయని మిల్లులకు ఈసారి వరి కొనుగోలుకు అనుమతులు ఇవ్వమని చెప్పారు. ఆయన అంతకుముందు నాగర్‌కర్నూల్ పట్టణంలోని శబరి రైస్‌మిల్, భవానీశంకర్ రైస్‌మిల్, గుడిపల్లి సీతారామాంజనేయ స్వామి రైస్‌మిల్లును తనిఖీ చేసి సీఎంఆర్ రైస్ నిల్వలను పరిశీలించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి స్వామికుమార్, డీఎం సివిల్ సప్లై బాలరాజు, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.



మిల్లర్లతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సీతారామారావు